సాక్షి నల్లగొండ

I

శుక్రవారం । 10 । నవంబర్ । 2023

న్యూస్‌రీల్

8.6 మి.మీ. సగటు వర్షపాతం నమోదు

నల్లగొండ అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 8.6 మిల్లీమీటర్ల సగటు వర్షం కురిసింది. అత్యధికంగా దామరచర్ల మండలంలో 83.6 మిల్లీమీటర్లు, తిరుమలగిరి సాగర్ 27.5, అనుముల హాలియా 26.8, అడవిదేవులపల్లి 21.7, కొండమల్లెపల్లి 17.2, నిడమనూరు 15.8, త్రిపురారం 15.6, పెద్దవూర 14.9 గుర్రంపోడు 9.4, నాంపల్లి 7.0, చింతపల్లి 6.7 దేవరకొండ 6.5, వేములపల్లి 3.0, మర్రిగూడ 2.3, చందంపేట 2.1, పీఏపల్లి 1.4, మాడుగులపల్లి 0.3, చండూరు 0.8, కనగల్ 1.1, తిప్పర్తి 0.5, శాలిగౌరారం 0.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

నేడు రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షలు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మ్యాక్స్ విజన్ శ్రీమహాలక్ష్మి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి


మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్: ఈ ఎన్నికల్లో సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి కోరారు. గురువారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య రక్షణ, ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చే ప్రభుత్వ ఏర్పాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌ను, ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం


చిట్యాలలో రైతుతో మాట్లాడుతున్న డీఎస్‌ఓ

చిట్యాల: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశామని డీఎస్‌ఓ వి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చిట్యాల, వట్టిమర్తి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వానాకాలం 2023–24 సీజన్‌లో ఇప్పటి వరకు 16,126 మంది రైతుల నుంచి 1,52,127 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.125.86 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లోని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ ఆర్‌ఐ డి.లింగస్వామి, కొనుగోలు కేంద్రాల సిబ్బంది ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రశాంత్

మిర్యాలగూడ: విద్యార్థులు క్రీడల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ ప్రశాంత్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ వాసుదేవరరావు అన్నారు. గురువారం మిర్యాలగూడలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా 14, 17, 19ఏళ్ల బాలబాలికల బాక్సింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్, త్రో బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, రామకృష్ణ, వెంకటరామిరెడ్డి, పంగ సైదులు, శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, నాగరాజు, యుగంధర్, కరుణాకర్ పాల్గొన్నారు.

ఒక్క రోజే 142 మంది

పోటెత్తిన నామినేషన్లు

బలమైన ముహూర్తం.. భారీగా కదిలొచ్చిన నాయకగణం



సూర్యాపేటలో జగదీష్‌రెడ్డి నామినేషన్ ర్యాలీకి హాజరైన జనం (ఇన్‌సెట్‌లో) అభివాదం చేస్తున్న మంత్రి


మిర్యాలగూడలో కాంగ్రెస్ అభ్యర్థి బీఎల్‌ఆర్ నామినేషన్‌కు తరలివచ్చిన జనం

- ర్యాలీలు, సభలతో హోరెత్తించిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్
- నామినేషన్లు దాఖలు చేసిన మంత్రి జగదీష్‌రెడ్డి, ఉత్తమ్, బీఎల్‌ఆర్
- సీపీఎం, బీఎస్పీ, ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీలతో పాటు ఇండిపెండెంట్లు కూడా..
- సూర్యాపేట, తుంగతుర్తిలో కాంగ్రెస్ తరఫున ఎక్కువ మంది నామినేషన్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఏకాదశి మంచి రోజుగా భావించి 12 నియోజకవర్గాల పరిధిలో 142 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అధికార పార్టీతో పాటు ప్రధాన పార్టీలకు చెందిన వారు, ఇండిపెండెంట్లు ఎక్కువగా గురువారమే నామినేషన్లు వేశారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నామినేషన్లు సమర్పించారు. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సూర్యాపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. భారీ ర్యాలీ నిర్వహించి ఆర్వో కార్యాలయానికి చేరుకొని నామినేషన్ వేశారు. ఇతర నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యనేతలంతా నామినేషన్లు సమర్పించారు.

కాంగ్రెస్ నుంచి ఎక్కువగా..

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎక్కువ మంది నామినేషన్లను దాఖలు చేశారు. సూర్యాపేటలో ముగ్గురు, తుంగతుర్తిలో ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. మిర్యాలగూడలో ఇద్దరు నామినేషన్లు వేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో గురువారం నామినేషన్ల సమయం ముగిసే వరకు కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించలేదు.దీంతో ఆశావహులంతా నామినేషన్లు వేశారు. ఆ మూడింటిల్లో అభ్యర్థులను కాంగ్రెస్ గురువారం రాత్రి ఫైనల్ చేసింది.

గురువారం నామినేషన్లు దాఖలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

- సూర్యాపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి, రవికుమార్, బీజేపీ అభ్యర్థిగా సంకినేని వెంకటేశ్వరరావు నామినేషన్ వేశారు.
- తుంగతుర్తిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, బీజేపీ అభ్యర్థిగా కడియం రామచంద్రయ్య నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా మోత్కుపల్లి నర్సింహులు, కొండేటి మల్లయ్య, మందుల సామేల్, వడ్డేపల్లి రవి, భాషపంగు భాస్కర్ నామినేషన్లు దాఖలు చేశారు.
- హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పిల్లుట్ల రఘు నామినేషన్ వేశారు.
- కోదాడలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నలమాల పద్మావతిరెడ్డి, జనసేన అభ్యర్థిగా మేకల సతీష్ రెడ్డి, సీపీఎం అభ్యర్థిగా మట్టిపల్లి సైదులు నామినేషన్ వేశారు.
- నల్లగొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కంచర్ల భూపాల్‌రెడ్డి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేయగా, ఇటీవల నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తరఫున ఆయన అనుచరులు మరో సెట్ వేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పిల్లి రామరాజుయాదవ్ నామినేషన్ దాఖలు చేశారు.
- నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వేముల వీరేశం నామినేషన్లు వేశారు.
- మునుగోడులో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా చలమల్ల కృష్ణారెడ్డి నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తరఫున ఆయన అనుచరులు నామినేషన్ దాఖలు చేశారు.
- దేవరకొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే రవీంద్ర కుమార్, బీజేపీ అభ్యర్థిగా కేతావత్ లాలూ నాయక్ నామినేషన్లు దాఖలు చేశారు.
- మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్‌ఆర్), సీపీఎం అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి నామినేషన్లు వేశారు.
- నాగార్జునసాగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే నోముల భగత్, కాంగ్రెస్ అభ్యర్థులుగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా కంకణాల నివేదితరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.
- భువనగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తరఫున వారి అనుచరులు మరో సెట్ నామినేషన్ వేశారు. సీపీఎం అభ్యర్థిగా కొండమడుగు నర్సింహ నామినేషన్ వేశారు.
- ఆలేరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా బీర్ల అయిలయ్య, బీర్ల అనిత నామినేషన్లు దాఖలు చేశారు.


సూర్యాపేట ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ఎట్టకేలకు ఆ మూడు ఖరారు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికలో కొన్ని రోజులుగా ఊరించిన కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు ఖరారు చేసింది. సూర్యాపేట, తుంగతుర్తి, మిర్యాలగూడ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇదివరకు ప్రకటించిన మూడు జాబితాల్లోనూ ఆ స్థానాలను పక్కనపెట్టిన కాంగ్రెస్ పార్టీ గురువారం రాత్రి నాలుగో జాబితాను ప్రకటించింది. సూర్యాపేట అభ్యర్థిగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, తుంగతుర్తి అభ్యర్థిగా మందుల సామేల్, మిర్యాలగూడ అభ్యర్థిగా బత్తుల లక్ష్మారెడ్డి పేర్లను ఖరారు చేసింది. దీంతో జిల్లాలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది.


ఆర్.దామోదర్‌రెడ్డి


బత్తుల లక్ష్మారెడ్డి


మందుల సామేలు


సూర్యాపేటలో నామినేషన్ దాఖలు చేస్తున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


హుజూర్‌నగర్‌లో నామినేషన్ వేస్తున్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి



మిర్యాలగూడలో నామినేషన్ వేస్తున్న సీపీఎం అభ్యర్థి రంగారెడ్డి

7 వ రోజు నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్లు		ఇప్పటి వరకు మొత్తం
నల్లగొండ	15	37
కోదాడ	15	31
సూర్యాపేట	14	33
మునుగోడు	15	40
నాగార్జునసాగర్	10	23
నకిరేకల్	7	23
ఆలేరు	9	24
తుంగతుర్తి	14	21
మిర్యాలగూడ	16	41
భువనగిరి	8	22
హుజూర్‌నగర్	12	19
దేవరకొండ	7	16
మొత్తం	142	330

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్

చండూరు: ప్రతిఒక్కరూ ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని, ముఖ్యంగా ఓపీఓలు విధులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ అన్నారు. గురువారం చండూరులోని మరియనికేతన్‌లో ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఓపీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న ఓపీఓలను వారి విధులపై ప్రశ్నలు అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు తీసుకొస్తున్న గుర్తింపు కార్డు ఏదో చూసి ఓటరు జాబితాలో మొదటి పోలింగ్ అధికారి మార్క్ చేయాలన్నారు. రెండవ పోలింగ్ అధికారి ఓటర్ల రిజిస్టర్‌లో ఓటర్ వివరాలు నమోదు చేస్తూ ఎడమ చేతి చూపుడు వేలిపై ఇంక్ మార్క్ వేయడంతో పాటుగా స్లిప్ జారీ చేసి సంతకం లేదా వేలిముద్ర తీసుకోవాలని సూచించారు. మూడవ పోలింగ్ అధికారి స్లిప్ చెక్ చేసి కంట్రోల్ యూనిట్‌లో బ్యాలెట్ బటన్‌ను నొక్కి ఓటరును ఓటు వేయడానికి అనుమతి ఇస్తారని తెలిపారు. ముందుగా కలెక్టర్ కర్ణన్ చండూరు మండల పరిధిలోని ఉడుతలపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆర్‌ఓ కార్యాలయం సందర్శన

నకిరేకల్: నకిరేకల్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కార్యాలయాన్ని గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కర్ణన్ సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ ద్వారా అభ్యర్థులకు నామినేషన్ వేయడంలో సందేహాలు ఉంటే క్లియర్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మునుగోడు నియోజకవర్గ ఆర్‌ఓ హేమంత్ కేశవ్ పాటిల్, సహాయ ఎన్నికల అధికారి ప్రసాద్ నాయక్ ఉన్నారు.


ఓపీఓలకు సూచనలు చేస్తున్న కలెక్టర్ కర్ణన్

రూ.42.86 కోట్ల నగదు, ఆభరణాలు స్వాధీనం

నల్లగొండ: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత పోలీస్, ఎక్సైజ్, ఇతర శాఖలు జరిపిన తనిఖీల్లో ఇప్పటి వరకు మొత్తం 42,86,93,443 రూపాయల విలువైన నగదుతోపాటు మద్యం, బంగారం, వెండి, డ్రగ్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ గురువారం తెలిపారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఈ వివరాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులకు సంబంధించి 221 కేసులను పరిశీలించి 217 క్లియర్ చేసి 33,74,53,000 రూపాయల విలువైన నగదును విడుదల చేసినట్లు తెలిపారు.

యాదాద్రిలో లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో లక్ష పుష్పార్చన పూజ జరిపించారు. ఇక ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యపూజలు సంప్రదాయంగా కొనసాగాయి. ఆయా పూజల్లో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

హుండీ ఆదాయం రూ.2.07కోట్లు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలను ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి ఆధ్వర్యంలో కొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో లెక్కించారు. రూ.2.07,45,291 నగదు లభించగా, 96 గ్రాముల మిశ్రమ వెండి, 4 కిలోల 900 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ హుండీ ఆదాయం 33 రోజులదని పేర్కొన్నారు.


ఆలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పూజలు చేస్తున్న అర్చకుడు

రాష్ట్రంలో యూసీసీ కోడ్ అమలు చేస్తాం

- బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తాం
- కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ఫెయిల్.. కేసీఆర్ కూడా ఫెయిల్
- కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్


ర్యాలీలో బీజేపీ మునుగోడు అభ్యర్థి కృష్ణారెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్

చండూరు : రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే యూసీసీ కోడ్ అమలు చేస్తామని కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ఇప్పటికే 370 ఆర్టికల్ రద్దు చేశామన్నారు. ఆయన గురువారం చండూరులో బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం రోడ్‌షోలో మాట్లాడారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఫెయిల్ అయ్యిందని, కేసీఆర్ కూడా ఫెయిల్ అయ్యారని, ఈ ఎన్నికల్లో కేసీఆర్ ను ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన కేసీఆర్ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా తన కుటుంబంలో అందరికీ ఉద్యోగం ఇప్పించుకున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నా.. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వటంలో ఈ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

రాజగోపాల్‌రెడ్డి చెల్లని రూపాయి

మునుగోడులో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెల్లని రూపాయి అని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇక్కడ చెల్లే రూపాయి బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి అని, చెల్లే నాణేనికే ఓటు వేయాలని ప్రజలను కోరారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తామన్నారు. బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఓట్లు అడగాలని సూచించారు. యువత నక్సలిజం వైపు ఆకర్షితులు కాకుండా క్రీడలలో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, బీజేపీ మునుగోడు అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవా వారోత్సవాలు ప్రారంభం

రామగిరి(నల్లగొండ): జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయసేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయసేవా వారోత్సవాలను ప్రారంభించారు. దీంట్లో భాగంగా నల్లగొండలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ బి.దీప్తి, న్యాయవాదులు నేతి రఘుపతి, ఎన్.భీమార్జున్‌రెడ్డి, భరోసా సెంటర్ ఎస్‌ఐ అంజలి పాల్గొన్నారు.

అమ్మానాన్న ఆశీస్సులతో..



హాలియా : నాగార్జునసాగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసే ముందు తన తల్లిదండ్రులు కుందూరు జానారెడ్డి, సుమతి ఆశీస్సులు తీసుకుంటున్న కుందూరు జయవీర్‌రెడ్డి

● పరుగో.. పరుగు..



చండూరు : నామినేషన్ దాఖలు చేసే సమయం దాటుతుండడంతో ఆర్‌ఓ కార్యాలయానికి పరిగెత్తుతున్న మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

● అంబేద్కర్‌కు సాష్టాంగ నమస్కారం



సాష్టాంగ నమస్కారం చేస్తున్న దేవరకొండ నర్సింహాచారి

భువనగిరిటౌన్ : భువనగిరి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న దేవరకొండ నర్సింహాచారి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన అంతకుముందు పాత బస్టాండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు తమ అనుచరులతో ర్యాలీగా వచ్చారు. వినాయక చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సాష్టాంగ నమస్కారం చేశారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పోటీ చేసే హక్కు అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించినందుకు నమస్కరించినట్టు చెప్పారు.



భువనగిరి : బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా ర్యాలీకి హాజరైన కార్యకర్తలు



సూర్యాపేట : కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ



తుంగతుర్తి : నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కిషోర్

జంగ్ తెలంగాణ

జోరుగా నామినేషన్లు



హుజూర్‌నగర్ : నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



నామినేషన్ వేసే ముందు అర్వపల్లిలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి అభ్యర్థి కిషోర్

ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం ఏకాదశి మంచి రోజు కావడంతో వారు సెంటిమెంట్‌గా భావించి ఇష్టదైవాల సన్నిధిలో పూజలు చేసి పోటాపోటీగా నామినేషన్లను వేశారు. ఈ సందర్భంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలు నిర్వహించారు. దీంతో ఆయా పట్టణాల్లో కూడళ్లు కార్యకర్తలతో కిక్కిరిశాయి.

– సాక్షి నెట్‌వర్క్



చండూరు : మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



భువనగిరి : నామినేషన్ వేసేందుకు వెళ్తున్న శేఖర్‌రెడ్డికి ఎదురొస్తున్న ఆయన భార్య వనిత



నిడమనూరు : సాగర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న భగత్



మిర్యాలగూడ : నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు



కోదాడ : నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి



నకిరేకల్ : నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య



మిర్యాలగూడ : నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి



నిడమనూరు : సాగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న జైవీర్‌రెడ్డి



నిడమనూరు : సాగర్ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న నివేదిత



తుంగతుర్తి : బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రాంచంద్రయ్య



కోదాడ : సీపీఎం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మట్టిపల్లి సైదులు



భువనగిరి : నామినేషన్ దాఖలు చేస్తున్న సీపీఎం అభ్యర్థి కొండమడుగు నర్సింహ



నల్లగొండ : నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి



సూర్యాపేట : కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



చండూరు : మునుగోడు బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కృష్ణారెడ్డి, చిత్రంలో కేంద్ర మంత్రి రాఠూర్



నకిరేకల్ : నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం



సూర్యాపేట : నామినేషన్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా శ్రేణులు



భువనగిరి : నామినేషన్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు



నల్లగొండ : నామినేషన్ ర్యాలీలో మాట్లాడుతున్న ఏఐఎఫ్‌బి అభ్యర్థి పిల్లి రామరాజు



చండూరు : ర్యాలీలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మునుగోడు అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రొఫైల్

సూర్యాపేట : రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
తల్లిదండ్రులు : నారాయణరెడ్డి, కమలమ్మ
స్వస్థలం : ఖమ్మం జిల్లా పాత లింగాల గ్రామం
భార్య : వరూధినిదేవి (లేట్)
కుమారుడు : సర్వోత్తమ్‌రెడ్డి
విద్యార్హత : బీఎస్సీ
రాజకీయ ప్రస్థానం : తుంగతుర్తి నుంచి 1985, 1989 (కాంగ్రెస్), 1994 (స్వతంత్ర), 2004 (కాంగ్రెస్), 2009 (కాంగ్రెస్) సూర్యాపేట నుంచి మొత్తం ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. భూగర్భ జలవనరులు, ఐటీ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2018లో సూర్యాపేట నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

తుంగతుర్తి : మందుల సామేలు
తల్లిదండ్రులు : రామయ్య, సత్తమ్మ
భార్య : యాదమ్మ
పుట్టినతేదీ : 14-07-1959
విద్యార్హత : డిగ్రీ
స్వస్థలం : ధర్మారం గ్రామం, అడ్డగూడూరు మండలం, సూర్యాపేట జిల్లా
రాజకీయ నేపథ్యం : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఇటీవల ఆయన కాంగ్రెస్‌లో చేరారు.

మిర్యాలగూడ : బత్తుల లక్ష్మారెడ్డి
జననం : 1969
స్వస్థలం : పెంచికల్‌దిన్న గ్రామం, నేరేడుచర్ల మండలం, సూర్యాపేట జిల్లా
తల్లిదండ్రులు : ఈశ్వర్‌రెడ్డి, వెంకట్రామమ్మ
విద్యాభ్యాసం : 10వ తరగతి
కుటుంబం : భార్య మాధవి, కుమారులు– సాయిప్రసన్నకుమార్, సాయిఈశ్వర్‌గణేష్‌కుమార్
రాజకీయ ప్రస్థానం : ట్రాన్స్‌పోర్ట్ యజమానిగా ఉంటూ పది సంవత్సరాలుగా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2020 కాంగ్రెస్ పార్టీలో చేరి మిర్యాలగూడలో కౌన్సిలర్‌గా గెలుపొంది మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగుతున్నారు.

తగ్గిన భూపాల్‌రెడ్డి ఆస్తులు, అప్పులు

నల్లగొండ : నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆస్తులతో పాటు అప్పులు కూడా తగ్గాయి. 2018 ఎన్నికల్లో చరాస్తులు రూ.1,57,11,230 ఉండగా.. స్థిరాస్తులు రూ.30.60 కోట్లు ఉన్నాయి. మొత్తం కలిపి రూ.32,17,11,230 ఆస్తులు, రూ.3 కోట్ల అప్పు ఉన్నట్లుగా 2018 ఎన్నికల సమయంలో కంచర్ల భూపాల్‌రెడ్డి తన అఫిడవిట్‌లో చూపించారు. 2023 ఎన్నికల సందర్భంగా గురువారం ఆయన తన అఫిడవిట్‌లో చరాస్తులు రూ.75,53,286, స్థిరాస్తులు రూ.19 కోట్లు.. మొత్తం కలిపి రూ.19,75,53,286 ఆస్తులను చూపించారు. అప్పులు రూ.58,17,299 ఉన్నట్లు వెల్లడించారు. అంటే గత ఎన్నికలతో పోలిస్తే ఆస్తి తగ్గిపోవడంతో పాటు అప్పు కూడా తగ్గిపోయింది. 32 కోట్ల నుంచి 19 కోట్లకు ఆస్తులు తగ్గిపోయాయి. అయితే ఆయన పేరు మీద ఒక కారుతో పాటు వ్యవసాయ భూమి, ఇతర ఇళ్ల స్థలాలు, ఇల్లు ఉన్నట్లుగా చూపించారు.

భగత్ చేతిలో రూ.10 వేలు మాత్రమే..

నిడమనూరు : నాగార్జునసాగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నోముల భగత్ చేతిలో ప్రస్తుతం రూ.10 వేలు మాత్రమే ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. ఆయన సతీమణి భవాని చేతిలో రూ.15 వేలు ఉన్నట్లు వెల్లగించారు. ఆయన స్థిరాస్తుల విలువ రూ.3,11,70,000 అప్పులు రూ.1,48,73,318 ఉన్నాయి. ఆయన సతీమణి పేరున స్థిరాస్తులు రూ.5,68,750 ఉండగా, అప్పులు రూ.75 లక్షలు ఉన్నట్లు వెల్లడించారు. ఆయన కుమారుడి పేరున చరాస్తి రూ.1.20 లక్షలు, కుమార్తె పేరున రూ.6 లక్షల స్థిరాస్తి, రూ.21,60,000 విలువైన చరాస్తి ఉన్నట్లు వెల్లడించారు.

భాస్కర్‌రావు ఆస్తులు రూ.4.78 కోట్లు

మిర్యాలగూడ : మిర్యాలగూడ బీఆర్ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు ఆస్తులు రూ.4.78 కోట్లుగా అఫిడవిట్‌లో చూపించారు. వీటిలో చరాస్తులు రూ.3.45కోట్లు, స్థిరాస్తులు రూ.1.33కోట్లు ఉన్నాయి. రూ.32 లక్షల విలువైన ఫార్చునర్ కారు ఉన్నట్లు వెల్లడించారు. తన భార్య పేరిట చరాస్తులు రూ.1.33కోట్లు, స్థిరాస్తులు రూ.7.60 లక్షలు ఉన్నట్లు తెలిపారు. ఆమె పేరిట రూ.5.59లక్షల విలువైన ఐ10 కారు ఉందని.. అప్పులు లేవని వెల్లడించారు.

ఆస్తులు వెల్లడించిన బత్తుల లక్ష్మారెడ్డి..
కాంగ్రెస్ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి పేరిట చరాస్తులు రూ.19.86 కోట్లు, స్థిరాస్తులు రూ.73.64 లక్షలు, అప్పులు రూ.3.16 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. తన భార్య మాధవి పేరిట చరాస్తులు రూ.26.29 కోట్లు, స్థిరాస్తులు రూ.1.35 లక్షలు, అప్పులు రూ.7.62 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు.

జైవీర్ ఆస్తి రూ.24 కోట్లు

నిడమనూరు : నాగార్జునసాగర్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి చరాస్తులు రూ.24,16,90,840, ఆయన భార్య భవానీ అనుశ్రీ పేరున రూ.10,31,79,044 విలువైన ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు. స్థిరాస్తులు జైవీర్ పేరున రూ.33.30 లక్షలు.. ఆయన భార్య పేరున రూ.2.17 కోట్లు ఉన్నట్లు చూపించారు.

నివేదిత ఆస్తులు రూ.21కోట్లు
నిడమనూరు: సాగర్ బీజేపీ అభ్యర్థి కంకణాల నివేదితకు స్థిర, చరాస్తులు మొత్తం రూ.21.89 కోట్లు, అప్పులు రూ.30 లక్షలు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. ఆమె భర్త శ్రీధర్‌రెడ్డి పేరున ఆస్తులు రూ.14 కోట్లు, కూతురు పేరున రూ.43 లక్షల ఆస్తులు ఉన్నట్లు చూపించారు.